క్లుప్తంగా

నందం కుటుంబానికి మంత్రి జోగి పరామర్శ



పెడన: పట్టణ ప్రముఖులు, కలంకారీ వ్యాపార వేత్త నందం వెంకటేశ్వరరావు సతీమణి సరస్వతి ఇటీవల మృతిచెందారు. ఆ కుటుంబాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సోమవారం పరామర్శించారు. సరస్వతి చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు బళ్ల గంగయ్య, మెట్ల గోపీ ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

పెడన: గ్రామాల్లో ఏ యే వసతులు అందుబాటులో ఉన్నాయి, లేనిది అనే విషయానికి సంబంధించి చేపట్టిన మిషన్ అంత్యోదయ సర్వే ఎంతవరకు వచ్చిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు ప్రశ్నించారు. సోమవారం ఆయన ఈఓపీఆర్‌డీ ఎం. జయరాముతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తాగునీరు, వైద్యం, విద్య, రోడ్లు, పారిశుద్ధ్యం వంటి వాటితో పాటు సర్వేలో పేర్కొన్న విధంగా తక్షణం నివేదికలు తయారు చేయాలని సూచించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు ఎంతవరకు చేసిందనే దానిపై ఎఫ్‌ఏలను అడిగి తెలుసుకున్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

బంటుమిల్లి: ములపర్రు పంచాయతీ శివారు దళితవాడలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన బాలఏసు విగ్రహ 18వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. బంటుమిల్లి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కామా అనిల్‌కుమార్ పర్యవేక్షణలో పలు ప్రాంతాలకు చెందిన ఫాదర్లు ఉదయకుమార్, ప్రవీణ్‌కుమార్, భాగ్య, రమేష్, ప్రతాప్‌లు పాల్గొని దివ్యబలిపూజ నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు దివ్యబలిపూజతో ముగిశాయి. ఈ సందర్భంగా అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా గ్రామోత్సవం

బంటుమిల్లి: పెందుర్రు గ్రామంలోని నాగేశ్వర స్వామి మందిరం వద్ద ఉత్సవమూర్తులకు సోమవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి ముగింపు కార్యక్రమాల్లో భాగంగా మూడు రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నంది విగ్రహం మండపం వద్ద మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు పాల్గొన్నారు. గ్రామ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కొమ్మారెడ్డి పాఠశాల విద్యార్థుల ప్రతిభ



బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో పలు విభాగాల్లో పాల్గొని బహుమతులు సాధించారని పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలోని శరత్‌చంద్ర అండ్ ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏడు నుంచి 14 సంవత్సరాల కటా విభాగాల్లో పాల్గొన్న 14మంది విద్యార్థులు బహుమతులు సాధించారని చెప్పారు. విజేతలను, కోచ్ వెంకటేశ్వరరావును డైరెక్టర్ కిషోర్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన

నాగాయలంక(అవనిగడ్డ): మర్రిపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద లింగ నిర్ధారణ చట్టంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు గుడివాడకు చెందిన కళాభారతి కల్చరల్ బృందం నిర్వాహకులు ఎం. శేఖర్ బాబు కళాబృందం జానపద కళారూపాల ద్వారా ప్రదర్శన నిర్వహించారు. లింగ నిర్ధారణ చేయడం నేరమని, అలా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యవేక్షించారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తోట్లవల్లూరు: చెప్పినచోట బస్సు ఆపలేదని ఆరోపిస్తూ ఆర్టీసీ డ్రైవర్‌పై వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక కనకదుర్గమ్మ కాలనీకి చెందిన మహ్మద్ షబ్బీర్ అనే వ్యక్తి సోమవారం ఉదయం తోట్లవల్లూరు నుంచి ఉయ్యూరు వెళుతున్న ఆర్టీసీ బస్సులో తనతో వాగ్వాదానికి దిగి దాడి చేశాడని డ్రైవర్ గిరి శ్రీనివాసరావు పోలీసుల ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.రమేష్ తెలియజేశారు.

చెత్త సమస్యలకు చెక్

- డంపింగ్ యార్డుల్లో చెత్త తరలింపు దిశగా అడుగులు
- కుప్పలుగా చేసి 45 రోజుల పాటు రసాయనాల పిచికారీ
- ఐదారు రకాలుగా చెత్తను వేరు చేసి తరలింపు
- స్వచ్ఛాంధ్ర సహకారంతో పటిష్ట చర్యలు



పెడన డంపింగ్ యార్డులో చెత్తను పోగులుగా చేస్తున్న ప్రొక్లెయిన్

పెడన: గతంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిచ్చేవి. దీనికి పరిష్కారంగా చెత్తను డంపింగ్ యార్డుకు తరలించేవారు. అలా తరలించిన చెత్త పేరుకుపోయి కొండలను తలపించేవిగా మారాయి. రోజు రోజుకు పేరుకు పోతున్న చెత్త. ఏం చేస్తే ఈ చెత్త కుప్పలు తరుగుతాయనే ఆలోచనలతో పురపాలక సంఘాలు, కార్పొరేషన్లు సతమతమవుతూ వచ్చాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ చెత్తను తరలించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేలా చూడాలని స్వచ్ఛాంధ్ర సంస్థకు అప్పగించింది. దీంతో వారు ఆర్థికంగా వెనుకబడిన పురపాలక సంఘాల్లో స్వచ్ఛాంధ్ర సంస్థ టెండర్లు పిలిచి పనులు అప్పగించగా ఆదాయం మెండుగా ఉన్న కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు మాత్రం స్వయంగా టెండర్లు పిలిచి పనులు అప్పగించుకున్నాయి. పెడన పురపాలక సంఘానికి సంబంధించి స్వచ్ఛాంధ్ర సహకారంతో లెగస్సీ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్రాజెక్టు వారు పెడన డంపింగ్ యార్డులోని చెత్తను తరలించేందుకు మూడేళ్ల ఒప్పందం చేసుకున్నారు.

రోజుకు 15.50 మెట్రిక్ టన్నులు

పెడన పురపాలక సంఘ పరిధిలో రోజుకు 15.50 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. ఈ చెత్తను ప్రతి రోజూ గుడివాడ రోడ్డులోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. దీంతో ఇక్కడ చెత్త పేరుకుపోయింది. మరో చోట డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు కూడా చేయడమే కాకుండా ఆర్థిక సంఘ నిధులతో స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుతం డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను ఖాళీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించడంతో కొత్త డంపింగ్ యార్డుకు బ్రేక్ పడింది.



పిచికారీ చేసిన తరువాత చెత్త కుప్పలు

45 రోజులపాటు రసాయనాల పిచికారీ..

డంపింగ్ యార్డులోని చెత్తను ప్రొక్లెయిన్‌తో కుప్పలుగా వేసి వాటిపై రసాయనాలు పిచికారీ చేస్తారు. పిచికారీ రసాయనాలతో పాటు నీటితో తడుపుతారు. తడి, పొడి చెత్తలుగా విడిపోతాయి. ఈ విధంగా తడి, పొడి చెత్తలను వేరు చేసి పొడి చెత్తలోని రీసైక్లింగ్‌కు పనికి వచ్చేవాటిని, పనికి రాని వాటిని వేరు చేస్తారు. పొడి చెత్తలో పాల ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, చాక్లెట్ కవర్లు, బిస్కట్ కవర్లు వంటి వాటిని రీసైక్లింగ్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులున్న కంపెనీకి తరలిస్తారు. అలాగే రీసైక్లింగ్‌కు పనికి రాని వాటిని ఒకే ప్రాంతంలో నిల్వ ఉంచడం లేదా ధ్వంసం చేస్తారు. రీసైక్లింగ్ అయ్యేవి, ఎరువులుగా వినియోగించేవి, మళ్లీ ఉపయోగానికి పనికిరానివిగా ఐదారు రకాలుగా వీటిని విడదీస్తారు. వేరు చేసిన చెత్తను తరలించి డంపింగ్ యార్డును ఖాళీ చేస్తారు.

పిచికారీ పూర్తయింది



డంపింగ్ యార్డులో చెత్తను పోగులుగా చేసి 45 రోజులు పాటు పిచికారీ చేసే ప్రక్రియ పూర్తయింది. లెగస్సీ వారికి కబురు చేశాం. రెండు, మూడు రోజుల్లో వచ్చి చెత్తను వేరు చేసే ప్రక్రియ ప్రారంభించి చెత్తను తరలిస్తారు. స్వచ్ఛాంధ్ర సంస్థ ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన లెగస్సీ కంపెనీ మూడేళ్ల పాటు ఒప్పందం చేసుకుంది.

-బి. రమ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, పెడన పురపాలక సంఘం

మరోసారి దీవించండి.. మరింత అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: 2019 ఎన్నికల్లో అమ్మ ఒడి, కాపు నేస్తం, రైతు భరోసా ఇస్తామని ఓట్లు అడిగామని, వాటితో పాటు ఎన్నో హామీలు అమలు చేశామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ప్రజలు మరోసారి జగనన్నను దీవించాలని, ఇంకా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం మోపిదేవి గ్రామ సచివాలయం ఒకటిలో నిర్వహించారు. మొత్తం 300 గృహాలను సందర్శించి లబ్ధిదారులకు అందుకున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, ఎంపీటీసీ కారుమూరి శివనాగరాజు, గ్రామ కన్వీనర్ కారుమూరి తాతయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రామప్రసాద్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛన్ వివరాలు తెలుపుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సంక్షేమ సారథి జగన్..

మచిలీపట్నంటౌన్: అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా పేరొందారని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 24వ డివిజన్‌లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, డివిజన్ ఇన్‌చార్జి చిత్తజల్లు రాజుతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, కార్పొరేటర్లు మీర్ అస్గర్‌అలీ, పల్లి శేఖర్, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, డివిజన్ కన్వీనర్ వీరనాగేశ్వరరావు, ధర్మరాజు, గూడవల్లి నాగరాజు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. గుండుపాలెం గ్రామంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ సంస్థను ఆశ్రయిస్తే న్యాయ సహాయం అందజేస్తామన్నారు. వరకట్న వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు. న్యాయవాది చీలి మునలయ్య, సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జె. రాధాకృష్ణ, మొవ్వ వెంకయ్య, కె. హరికృష్ణబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

క్రీడాకారులకు డీఆర్వో అభినందన

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన క్రీడాకారులను సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని మహేశ్వరంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 11వ తేదీ వరకు జరిగిన ఐదవ జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఐదుగురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో నాగిడి గాయత్రి (సిల్వర్ మెడల్), నాగిడి భార్గవి (నాలుగో స్థానం) స్లాలమ్ డిస్ప్లేలో ఈ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను డీఆర్వో వెంకటేశ్వర్లు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి యు. శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ కె. ఝాన్సీలక్ష్మీ, వాటర్ స్పోర్ట్స్ కోచ్ ఎం. శ్రీనివాస్, టి. నాగబాబు పాల్గొన్నారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

కనుల పండువగా రథోత్సవం

కృత్తివెన్ను: మహా శివరాత్రి ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. వేలాదిమంది భక్తుల జయజయ ధ్వానాల నడుమ అరటి గెలల అలంకరణతో తయారు చేసిన రథంపై దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి, రమాసహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి వార్లు ఆసీనులయ్యారు. కృష్ణా జిల్లాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి హాజరైన అశేష జనవాహిని మధ్య స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. పండితుల మంత్రోచ్చరణలతో పాటు వీనుల విందైన సంగీతం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు, ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు రథోత్సవాన్ని ప్రారంభించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్త జనసందోహం

అధునాతన దంత వైద్య చికిత్సలతో మేలు

డాక్టర్ సతీష్ ఆలపాటి

గన్నవరం రూరల్: అధునాతన వైద్య చికిత్సలతో దంత వైద్య విద్యార్థులు సమాజానికి సేవలందించాలని చికాగో ఇల్లినోయిస్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సతీష్ ఆలపాటి పేర్కొన్నారు. సోమవారం గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో పీడియాట్రిక్ డెంటిస్ట్రీ డిపార్ట్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ జరిగింది. రీజనరేటీవ్ ఎండోడాంటిక్స్ పద్ధతిలో అధునాతన దంతవైద్య సేవలు అందించడంపై 400మంది దంత వైద్య విద్యార్థులు పాల్గొన్న సదస్సులో ఉపన్యసించారు. అనంతరం చవిద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు, డాక్టర్ పిసిమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్స్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల్లో దంత సంరక్షణపై అవగాహన పెరిగిందన్నారు. పీడియాట్రిక్ డెంటిస్ట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ కె.రవిచంద్ర శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఏఓ వై.మధుసూదనరావు, వైద్యులు కె.శ్రీకాంత్, కె.మృదుల పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరమంచి భాస్కర విజయకుమార్, బుద్దు నాగవరప్రసాద్ బ్రహ్మత్వంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం పలువురు మహిళలు వసంతోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజాధిరాజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు నిత్య బలిహరణ, రాత్రి 9 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం పారువేట, శమీ వృక్షపూజ జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన

కోడూరు: గుండెపోటు వచ్చిన సమయంలో ప్రథమ చికిత్సగా చేసే కార్డియో పల్మనరీ రిసెస్టియేషన్ (సీపీఆర్)పై రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక కోట రాఘవయ్య విద్యాసంస్థల ప్రాంగణంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ వంగర శేషగిరిరావు విద్యార్థులకు సీపీఆర్ చేసే ప్రక్రియను వివరించారు. అత్యవసర సమయంలో సీపీఆర్ ప్రక్రియ బాధితులను రక్షించే అవకాశం ఉందని చెప్పారు. శాఖ మండల అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, విద్యా సంస్థల గౌరవ సలహాదారు కోట వెంకటసుబ్బారావు, ప్రిన్సిపాల్ బడే కరుణ పాల్గొన్నారు.



సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న శేషగిరిరావు

25 నుంచి మినుము కొనుగోళ్లు

కైకలూరు: మినుము పంటను ఈ నెల 25 నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కైకలూరు, కలిదిండి మండల వ్యవసాయాధికారులు ఆర్.దివ్య, కె.విద్యాసాగర్ చెప్పారు. కోత దశలో ఉన్న మినుము పంటను సోమవారం వారు పరిశీలించారు. మినుము కొనుగోళ్లపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సంవత్సరానికి ప్రభుత్వం మినుము క్వింటాకు రూ.6600 కనీస మద్దతు ధరగా నిర్ణయించిందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మినుము విక్రయించే రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కై కలూరు మండలం ఆచవరం, వేమవరప్పాడు, తామరకొల్లు గ్రామాల్లో మినుము పైరు సాగు చేశారని, ప్రస్తుతం కోత దశలో మినుము ఉందన్నారు. ప్రతి రైతూ పంటను ఈ క్రాఫ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



సానారుద్రవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ విద్యాసాగర్

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

పామర్రు: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఏఎస్ఎం ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి అన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 19న వేమవరం కొండలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు బహుమతులను, ప్రశంసాపత్రాలను సాధించారన్నారు. అండర్–14 కటా విభాగంలో జశ్వంత్ సాయినాథ్, దుండి ప్రతాప్, అభిషేక్ కుమార్, ధాత్రి చరణ్య, మమతాశ్రీ, హర్షితలు ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని పొందారన్నారు. వర్షికారెడ్డి, మణికంఠ, రాకేష్ పి.మణికంఠ ద్వితీయ స్థానంలో రజిత పతకాలను సాధించారన్నారు. పవన్‌కుమార్, మౌనిక, నిశాంత్, సుప్రియ దీక్షిత, శ్రావ్యలు తృతీయ స్థానంలో నిలిచి కాంశ్య పతకాలను పొందారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ వీవీఎస్ రామకృష్ణలను ప్రిన్సిపాల్, హెచ్ఎం శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

ధైర్యంగా మద్దతు కోరండి

మంత్రి జోగి రమేష్



పెడన: రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ప్రభుత్వ పథకాలను వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని ప్రజలను ధైర్యంగా కోరాలని చెప్పారు. మండలంలోని వలంటీర్లు, సచివాలయ సమన్వయకర్తలు, గృహ సారథుల శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక పెడన వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగింది. మంత్రి మాట్లాడుతూ సమన్వయకర్తలు, గృహ సారథులు మీమీ పరిధిలోని కుటుంబాలను నిత్యం కలిసి వైఎస్సార్ సీపీ అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు. సమస్యలుంటే నా దృష్టికి కానీ, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి కానీ తీసుకురావాలని సూచించారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ వాణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ చారుమతి, జోగి రాజీవ్, బెజవాడ నాగరాజు, కొండవీటి నాగబాబు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించండి

బంటుమిల్లి: జగనన్న అందిస్తున్న పథకాలపై పేద ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంతి జోగి రమేష్ అన్నారు. సోమవారం రాత్రి మల్లేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మార్చి 18 నుంచి ప్రారంభంకానున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ వి. చినబాబు మాట్లాడారు. బంటుమిల్లి సర్పంచ్ వి. కృష్ణవేణి, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కె. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలి

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గురజ, కొరగుంటపాలెం జగనన్న కాలనీల్లో సోమవారం ఆమె పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతిపేదవాడి సొంతింటికల నెరవేరాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు. ఉగాది పండుగ నాటికి నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయాలని కోరారు. కాలనీల్లో శరవేగంతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోత్రు ఏసుబాబు, నాయకులు గంటా కోటేశ్వరరావు, పేర్ని పృధ్వీ ఉన్నారు.

హుండీ కానుకల ఆదాయం రూ.3.16 లక్షలు



తోట్లవల్లూరు: ఐలూరులోని గంగాపార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయ హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. హుండీ కానుకల ద్వారా రూ. 2,89,302, రఘునాయకస్వామి హుండీ ద్వారా రూ.27,384ల ఆదాయం లభించినట్లు ఆలయ మేనేజర్ జయశ్రీ తెలిపారు. ఆలయ చైర్మన్ సూర్య వరప్రసాద్, ఫెస్టివల్ ఆఫీసర్ ఫణికుమార్, దేవదాయశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

25 లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

ఏడీఏ జయప్రద

అవనిగడ్డ: ఈ పంట నమోదు చేసుకుని ఇంకా ఈకేవైసీ చేయని రైతులు ఈనెల 25వ తేదీ లోగా చేయించుకోవాలని ఏడీఏ జయప్రద అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 70 శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయిందన్నారు. నాగాయలంక, మోపిదేవి మండలాల్లో 75 శాతం, అవనిగడ్డలో 70 శాతం, కోడూరులో 62 శాతం పూర్తయిందని చెప్పారు. ఈకేవైసీ కార్యక్రమాన్ని ముమ్మరం చేశామని, రైతులు సహకరించాలని కోరారు. ఈపంట నమోదు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి వేలిముద్ర వేయించుకోవాలన్నారు. దీనివల్ల ప్రభుత్వం అందించే సంక్షేమ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అందడంతో పాటు విపత్తుల సమయంలో పరిహారం లభిస్తుదని వివరించారు.

డ్రెయిన్‌లో పూడిక తీత

మచిలీపట్నంటౌన్: 36వ డివిజన్ రాజుపేట ఆంధ్ర జాతీయ కళాశాల సమీపంలోని మేజర్ డ్రెయిన్‌లో పేరుకుపోయిన పూడికతీత పనులు సోమవారం ప్రారంభించారు. డ్రెయిన్‌లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, క్యారీబ్యాగ్‌లు పెద్దఎత్తున పేరుకుపోయాయి. కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలను తొలగించారు.



వరిగడ్డి వామి దగ్ధం

పెడన: 11వ వార్డు చెంచుల కాలనీలో వరిగడ్డి వామి దగ్ధమైంది. మాజీ కౌన్సిలర్, కో–ఆప్షన్ సభ్యుడు వీరంకి నరసింహారావు మూడు రోజుల కిందట గడ్డి కొనుగోలు చేశారు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డివామికి నిప్పు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.లక్షకు పైగా విలువ గల గడ్డి కాలిపోయిందని బాధితుడు తెలిపారు.